# మరో మామూలు కథ

ఆరున్నరకి వస్తానన్న మనిషి ఏడున్నర దాకా రానందుకు ఆమె మీద నాకు కోపం రాలేదు-భారతి కూడా అందరిలాంటి అమ్మాయే నా అనిపించి బాధకలిగింది-భారతిని ఆ విధంగా అర్థం చేసుకోవలసి వచ్చి నందుకు నేను అవమానం చెందేను- ప్యాకెట్లో సిగరెట్లు అయిపోయేయి- అరున్నరకి వస్తాననే భారతి ఎప్పుడూ ఆరూ ఇరవై తొమ్మిదికే వస్తుంది కనుక ఏడున్నర తరువాత రాదనే నిర్ణయానికి వచ్చి ఇంక అక్కడ నుంచీ కదుల్దామనుకుంటూండగా వివేకానంద కారు నా ముందు ఆగింది-

"ఎక్కు ఎక్కు-" అన్నాడు అతను.

శనివారం సాయంత్రం ఏడున్నరకి అతని కారు ఎక్కితే ఆదివారం తొలి ఘడియల వరకూ బయట పడలేననే విషయం నాకు తెలుసు. ఈ మధ్యన శనివారాలు వివేకానందతో గడపడం లేదు. రెండు మూడు నెలలుగా ఇక్కడ ఈ చోటున ఇలా ఓ పది నిమిషాలు నిలబడ్డం, ఆమె రావడం, బందరురోడ్డు పొడవునా నడక కంధారీలో భోజనం, సెకండ్‌షో పిక్చర్, ఆపైన ఆమెని ఇంటి దగ్గర దిగబెట్టడం, ఇది కార్యక్రమం ఆమె పరిచయం ముందు శనివారాలన్నీ అతనివే, నేను కారెక్కేను.

నాకొక అమ్మాయితో పరిచయం అయిందని, త్వరలో మేం ఇద్దరం పెళ్ళి చేసుకుంటాం అని వివేకానందకి తెలుసు, అమ్మాయి ఎవరో పేరేమిటో, వివరాలు అతను అడగ లేదు. నేను చెప్పలేదు.

"ఏం? అమ్మాయి రాలేదా! అలా దిగాలుపడ్డావ్?" అన్నాడు కారు స్టార్ట్ చేసి, నేనేం జవాబు చెప్పలేదు, ఇవ్వాళ తనునన్ను వాళ్ళన్నగారింటికి భోజనానికి పిలిచింది. అన్నకి పరిచయం చేస్తానంది. విషయం తేల్చి పడేస్తానంది. కానీ రాలేదు, అంటే అన్నగారు ఆమె మనసు మార్చేరాడా? భారతి కూడా అలా మారిపోయే మనిషేనా? పలకరిస్తే ముడుచుకుపోయి, "ఆ" అంటే ఉలిక్కిపడి. కోప్పడితే ఏడ్చి, భయపెడితే బెదిరిపోయే ఆడపిల్లకాదు ఈ భారతి, "ధైర్యవంతురాలైన చదువుకున్న ఓ మనిషి" అనుకున్నాను. స్వతంత్రంగా ఆలోచించగల వ్యక్తి అనుకున్నాను, అయితే అలాంటి అమ్మాయిలే లేరనుకోవాలా? "భాస్కర్‌ని ఎక్కించుకొద్దాం అతని దగ్గర "గెస్ హూ ఈజ్ కమింగ్ ఫర్ డిన్నర్" క్యాసెట్ ఉందట, మంచి మూవీ," అన్నాడు వివేకానంద.

నేనెందుకో ఉలిక్కిపడ్డాను.

భాస్కర్‌ని ఎక్కించుకొని వచ్చేసరికి సారథి మీనన్ ఇద్దరూ వివేకానంద డ్రాయింగ్ హాల్‌లో కూర్చుని మైకేల్ జాక్సన్ రికార్డుని చెవులు బ్రద్ధలయేలా మోగించేస్తున్నారు.

బీరుతో తెగ లావయిపోయిన మీనన్ వచ్చీ రాని స్టెప్స్ వేస్తున్నాడు. సారథి సోఫామీద దరువు వేస్తున్నారు. "థ్రిల్లర్"లో నాకేం అనిపించ లేదు. "హాయ్ రాంబాబూ! నువ్వేమిటిలా! ఈ మధ్య నువ్వు మంచి పాలుడివై పోయావని విన్నానే!" అన్నాడు సారథి.

స్టీరియో కట్టేసి వచ్చి కూర్చున్నాను.

"సంగీతం ఆస్వాదించడానికి చెవులు ఉండాలి" అన్నా మీనన్.

జానకి పెద్ద మగ్గుతో పొగలు కక్కే కాఫీ తెచ్చి, "పెళ్ళెప్పుడండీ రాంబాబుగారూ!" అనడిగింది! నాకు కాఫీ పంచి "బేస్ట్" అని జానకికీ తెలుసు, నన్ను చూస్తూనే కాఫీ కలపడం జానకి అలవాటు "ఏమో!" అన్నాను. ఆమె నాకు కాఫీ ఇస్తూవుంటే సారథి ఆమెని తినేసేలా చూస్తున్నాడు. సారథి మారలేదన్న మాట!

"మాకు అన్నీ టేబిల్ మీద పెట్టేసి నువ్వు తిని వెళ్ళిపో జానకీ, ఫ్రిజ్‌లో అరటి పళ్ళు పట్టుకెళ్ళిపో! బసకి డబ్బులున్నాయా!" అన్నాడు వివేకానంద.

"నా పనంతా అయిపోయిందండీ, నేవెళ్ళిపోతున్నా," అంది జానకి.

గాజు గ్లాసులు నవ్వుతో తళతళలాడుతున్నాయి. టేబుల్ మీద డిన్నర్ సెట్ మెరుస్తోంది. నాప్‌కిన్స్ తెల్లగా ఉన్నాయి.

వివేకానందకి అన్నీ నీట్‌గా ఉండాలి.

"పోనీ ఉండి పోరాదూ ఈ రోజుకి," అన్నాడు సారథి జానకి వెడుతూంటే.

నేను వాడిని లాగితన్నుదామనుకున్నాను, కానీ అది వివేకానంద ఇల్లయిపోయింది, వివేకానంద "గుడ్ మ్యానర్స్" మనిషిగా మారి అవతారం ఎత్తినటువంటివాడు. పొరపాటుగా కూడా ఎవర్నీ ఏమీ అన కూడదు. "ప్లీజ్" లు "సారీ" లు తప్ప, అతను సారథినీ మీనన్‌ని ఎలా భరిస్తున్నాడో ఇన్నాళ్ళుగా నాకు ఆశ్చర్యంగా అనిపిస్తూ ఉంటుంది.

మీనన్ బీర్ తప్ప త్రాగనని పెళ్ళిలో భార్యకి ప్రమాణం చేశాడట. అందుకోసం అతని కోసం బీర్, సారథికి "రమ్" తప్ప పడదట, అతని కోసం రమ్, భాస్కర్‌కి నాకు వివేకానందకీ విస్కీ, ఏర్పాటు చేశాడు వివేకానంద. "అస్తమానం నీ మీద పడి త్రాగడం ఏం బాగాలేదు,

ఇవ్వాళ ఖర్చు నాది," అని భాస్కర్ పర్సులో నుంచి రెండు వందలు, తీసి సారథికిచ్చేడు. "అంటే మేం వివేకానంద మీదే బ్రతుకుతున్నాం అని నీ ఉద్దేశం అన్నమాటేగా! అతను రమ్మని ఫోన్ చేస్తేనే వచ్చేం అన్నాడు మీనస్ నిష్ఠూరంగా.

"త్వరగా వెళ్ళవోయ్," అని అతన్ని సర్ది పంపేడు వివేకానంద.

"నీ ఇల్లు చూడ ముచ్చటగా ఉంటుందోయ్! అన్నీ అపర్చేప్! కానీ ముఖ్యమైందే లేదు," అన్నాడు భాస్కర్,

"అదృష్టం తలుపు తట్టే వరకూ వేచివుండాలి" అన్నాను నేను.

"అతనికేం తొందరోయ్, నిక్షేపంగా జానకి ఇల్లు చూస్తూండగా, వివేకానంద అదృష్టవంతుడు, కంపెనీ ఇచ్చిన ఇల్లు, కారు, తండ్రి సంపాదించి పెట్టిన ఆస్తి, పైగా జానకి."

నాకీసారి సారథిమీద కోపంరాలేదు, వివేకానంద వల్ల మాలిన వినయం మీద కోపం వచ్చింది. మీనస్ సరుకుల్తో సహా స్కూటర్ మీదొచ్చేడు. "మీరిద్దరూ గొడవ చెయ్యకుండా ఉంటే వీడియో వేస్తాను. మంచి క్యాసెట్ వుంది" అన్నాడు వివేకానంద.

గెస్ యు ఈజ్ కమింగ్ ఫర్ డిన్నర్.

పిడ్నీ పాయిటర్ సినిమా, మళ్ళీ భారతి గుర్తొచ్చింది, భారతి ఎందుకు రాలేదు! ఎందుకురాలేదు? "కులం గోత్రం, వంశం, వారసత్వం, ఇవన్నీ ట్రాష్, నీ బలహీనతలన్నింటిలోనూ నిన్ను ఇష్టపడుతున్నాను. ఐ సింప్లీలైక్ యూ మనిద్దరం చాలా మరచి కాంబినేషన్" అని క్రిందటి శనివారం చెప్పింది. నా కులం గురించి, మా అమ్మానాన్నల వర్ణాంతర వివాహం గురించి, నాకు ఆస్తిలేక పోవడాన్ని గురించి నా సిగరెట్లు అప్పుడప్పుడూ ఫ్రెండ్స్‌తో కొంచెం విస్కీ గురించి, రూమ్ ఎప్పుడూ అవకతవగ్గా వుంచుకోవడాన్ని గురించి, చెప్పబోయినప్పుడు, అవన్నీ

చెప్పనివ్వకుండా ఆపి, పై మాటలు చెప్పింది. తల్లీ తండ్రీ తరువాత వారంతవాడైన పెద్దన్నగార్కి నన్ను పరిచయం చేసి, ఆయన అంగీకారం పుచ్చుకోడం అనే ఫార్మాలిటీ వుంది గనుక— ఆ ఫార్మాలిటీ ఈ రోజు పూర్తి చేస్తానంది-

మీనన్ సారధి ప్రక్కకి చేరి వాదన మొదలు పెట్టేడు-వాళ్ళలా వాసీపు వాదులాడుకొని- బిల్లలు గుద్దుకొని—కాలర్లు పట్టేసుకుని-తిట్టుకొని తరువాత "నువ్వు నా అంతరంగిక మిత్రుడు" అని అనుకొని ఒకర్నొకరు కౌగలించుకుని, కళ్ళు తుడుచుకుని, ఒకరి ఒళ్ళో ఒకరు పడుకొని చివరికి ఇద్దరూ మరోసారి జానకి గురించి అసభ్యంగా మాట్లాడి లేచిపోతుంటారు.

సినిమా మొదలైంది-భాస్కర్ సీరియస్‌గా సినిమా చూస్తున్నాడు.

చల్లని విస్కీ వెచ్చగా గొంతులోకి జారింది. భారతి ఎందుకు రాలేదు? ఎందుకరాలేదు? ఎందుకు రాలేదు?

"బిస్లేలు బావున్నాయ్" అన్నాడు మీనన్ "జానకి చెయ్యి అలాంటిది" అన్నాడు సారధి.

"తక్కువేమి మనకు జానకి ఇక్కడుండు వరకూ" అని పాటందు కున్నాడు.

"మీరిద్దరూ వరండాలోకి వెళ్ళిపొండి" అన్నాడు భాస్కర్.

"మేం వెళ్ళం" అని టీ. వి. సెట్ ముందుకొచ్చి కూర్చున్నారు వాళ్ళిద్దరూ.

మూవీ అవడంతో వీడియో ప్లేయర్ కట్టేసి టీ. వి. ఆన్ చేసేడు వివేకానంద. నేషనల్ ప్రోగ్రాం ఏదో వస్తుంటే, హడావుడిగా దాన్ని

స్విచ్ ఆఫ్‌చేసి మళ్ళీ మైకేల్ జాన్సన్ రికార్డ్ స్టీరియోలో అమర్చేడు మీనన్.

"భోజనం చేద్దామా?' అన్నాడు వివేకానంద—సారథి అప్పటికీ టేబిల్ మీద గిన్నెలన్నీ మూతలు తీసి చూస్తున్నాడు-

"వచ్చే శనివారం మా ఆవిడొస్తుంది - బహుశా ఇంక నేనిలా రాలేను— కానీ ఇక నుంచీ వివేకానందకి ప్రతి శని ఆదివారాలు మా ఇంట్లో భోజనం—" అన్నాడు మీనన్ - "ఓ! యా!" అని నవ్వేడు వివేకానంద- వాళ్ళిద్దరూ భోజనం కానిచ్చి స్కూటర్ మీద వెళ్ళిపోయేరు.

"ఈ పూట నీ మూడ్ బాగాలేదు— ఇక్కడుండి పో! భాస్కర్‌ని దింపేసివస్తా—" అన్నాడు వివేకానంద—

బూట్లు విప్పేసి, సోఫాలో పడుకున్నాను- భారతి ఇంకరాదా!

అరగంటలో వివేకానంద వచ్చేడు-బీరువాలో నుంచీ ఇస్త్రీ లుంగీ తీసిచ్చి, "నీ కభ్యంతరం లేకపోతే - నీ కొచ్చిన కష్టం గురించి చెప్పు మనిద్దరం మంచి స్నేహితులం అనుకుంటున్నాను-" అన్నాడు—

చెప్పేను-ఆ అమ్మాయి పేరు భారతి. బ్యాంక్‌లో ఉద్యోగం — అమ్మా నాన్న లేరు - అన్నగారింట్లో వుంటోంది - అమ్మా నాన్న అన్న గారికేం ఆస్తిఇవ్వలేదు- బిజినెస్ చేసి అతనే సంపాదించుకుంటున్నాడు — భారతికి పెళ్ళి చెయ్యాలంటే లక్షలతోపని అని బాధపడుతున్నాడట. ఆ బాధ నీ కవసరం లేదని ఈ రోజు అతనికి చెప్పేస్తానంది, కానీ రాలేదు. ఇది సంగతి.

"భారతి, లవ్లీ నేమ్, చిన్నప్పుడు నాకో స్నేహితురాలుండేది, పదిహేనేళ్ళ క్రిందట బెంగుళూర్లో మా ఇంటి ప్రక్క. చురుకైన అమ్మాయి అని గొణుక్కొని.

"అయితే భారతి అన్నగారు ఆమెని నీదగ్గరకు రాకుండా ఆపే డంటావా?" అన్నాడు వివేకానంద.

"మరేం అనుకోను?" అన్నాను.

"నాన్సెన్స్! ఆ అమ్మాయి రేప్రొద్దున తప్పకుండా నీకు ఫోన్ చేస్తుంది. నాళ్ళన్న వొప్పుకోకపోతే నీ పెళ్ళి నేను చేస్తాను. ఇంత చిన్న విషయం గురించి ఆలోచిస్తావేమిటోయ్!" అన్నాడు.

"అది చిన్న విషయమా?" అన్నాను—

"అవును చిన్న విషయమే ఏకో పనివచ్చి ఆగిపోయి వుంటుంది. షి విల్ కమ్" అని గట్టిగా చెప్పేడు. అతను నిద్రపోయాడు. చాలా సేపటికి నేనూ నిద్రపోయేను, అతనన్నట్లు మరునాడు భారతి నా రూమ్‌కి వచ్చింది. నిన్న సాయంత్రం నన్ను తన అన్నగారింటికి తీసుకు వెళ్ళలేక పోయినందుకు క్షమాపణ అడిగింది. ఇంత ఆ అవసరం లేదంది.

"పెళ్ళి అనే ఫార్మాలిటీ లేకుండా ఒక పురుషుడు ఒక స్త్రీ కలిసి జీవితం ప్రారంభించడం అనే విషయం మీద నీ అభిప్రాయం ఏమిటి?" అంది.

"నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాను.

"నా అభిప్రాయం ఇదే" అని ఓ పెద్ద సూట్‌కేసు చూపించింది.

"వెల్‌కం" అన్నాను, కిచెన్‌లోకి వెళ్ళి బీర్ మగ్గు నిండా కాఫీ తెచ్చి ఆమెకిచ్చి, వివేకానందకి ఫోన్ చేయడం కోసం ప్రక్కింటికి పరి గెత్తేను.

గంటలో వివేకానంద రెండు పెద్ద పూల దండలతో వచ్చేడు.

"హాయ్ వివేక్" అంది అతన్ని చూస్తూనే భారతి.

"భారతి నువ్వా!" అన్నాడు వివేకానంద పూదండలు సోఫాలో పడేసి. వాళ్ళిద్దరూ గబ గబా మాట్లాడేసుకున్నారు. ఏం చెయ్యాలో తోచక నేనలా నిలబడి పోయాను. అరగంట తరువాత వివేకానంద మా ఇద్దరికీ

చెరో దండా ఇచ్చి మార్చుకుంటుండగా ఫోటో తీసేడు. తరువాత మమ్మల్ని తన ఇంటికి తీసుకువెళ్ళేడు. మా ఇంటికి కావల్సిన సామాన్లన్నీ తన డబ్బు అప్పు ఇచ్చి కొనిపెట్టేడు. జానకిని పంపి మా ఇల్లంతా సర్దించేడు.

"ఇలా మీ ఇద్దరూ పెళ్ళి చేసుకోవడం నాకు చాలా బావుంది. నేనిక ఎప్పుడంటే అప్పుడు మీ ఇంటికి రావచ్చు. ఇద్దరూ నా స్నేహితులే" అని సంబర పడిపోయాడు.

రెండు వారాలయ్యాక మీనన్‌ని అతని భార్యనీ, సారధినీ కూడా భోజనానికి పిలిచాను.

జీవితం ఓ గాడిలో పడింది. భారతికీ నాకూ సాధారణంగా అభిప్రాయభేదాలు లేవు. ఈ మధ్యనే వివేకానంద ఎక్కువ మా ఇంటికి రావడమో-మమ్మల్ని తన ఇంటికి పిలవడమో పరిపాటయిపోయింది.

వివేక్ గురించి నాకు స్థిరమైన అభిప్రాయా లున్నాయి-అతను ఆడవాళ్ళని గౌరవిస్తాడు-పనిమనిషి అయిన జానకిని అతను చూసే తీరు చూస్తేనే నాకతని మీద గౌరవం పెరిగింది - ఇరవై రెండేళ్ళ జానకి, వివేకానందంటే ఏ మాత్రం సంకోచం బెదురూ లేకుండా అతనింట్లో పనిచేస్తుందంటే, అతనంటే ఆమెకి భక్తి, అతను త్రాగినా చాలా సంయమంగా ఉంటాడు. ఎవర్నీ తూలనాడడు, జానకి కాఫీ ఇస్తూంటే సారధి ఆమె వేళ్ళు తాకకుండా ఉండడు.

"జానకీ! వాడి చేతికి నువ్వు కాఫీ ఇవ్వకు వాడు చెయ్యి చాచినా నువ్వు టీపాయ్ మీదే పెట్టు" అన్నాడు వివేకానంద. ఈ మధ్యన అతను తరుచు మా ఇంటికి వస్తుంటే, సారధికీ, మీనన్‌కీ బాధగా వుంది. వాళ్ళిద్దర్నీ ప్రతి శనివారం పిలవడం నాకిష్టం ఉండదు. ముఖ్యంగా సారధి గొంతు విప్పాడంటే నాకు భయం భారతి వింటే ఏం అనుకుంటుందోనని

సిగ్గు. "మీనన్ భార్య వచ్చాక ననొక్క రోజైనా తనింటికి పిలవలేదు" అన్నాడు వివేకానంద ఓ రోజు.

మీనన్ నన్నూ భారతినీ ఓ రోజు భోజనానికి పిలిచేడు. నా కాశ్చర్యం అనిపించింది ఎన్ని శనివారాలు మీనన్. వివేకానంద ఇంట్లో గడిపేడు. అతనికి ఎన్ని చెప్పేడు. ఆ రోజు సాయంత్రం సారధి శుభ లేఖ తెచ్చేడు.

"ఏమిటింత సస్పెన్స్ మెయిన్‌టెయిన్ చేశావ్!" అన్నాను నేను.

"అనుకున్న సంబంధమే. కట్నం గురించి కొద్ది పేచీలొచ్చి ఇన్నా ళ్ళాగింది. నువ్వూ మీ ఆవిడ తప్పకుండా రావాలి?" అన్నాడు.

"అందరికీ పెళ్ళయిపోతోంది నువ్వే మిగిలేవ్!" అంది భారతి వివేకొని.

"నీలాంటి అమ్మాయిని ఎక్కడైనా చూడు! తప్పకుండా చేసు కుంటాను" అన్నాడు.

నేను భోజనం చేస్తూ భారతి మొహంలోకి చూశాను. ఆమె అది గమనించలేదు.

"సిగ్గులేదూ, ముప్పైరెండేళ్ళొచ్చి ఇంకా పెళ్ళి సంబంధం ఇంకో కళ్ళు చూడాలా? ఈ విశాలమైన ప్రపంచంలో నీకింక మంచి అమ్మాయే కనించలేదా! అసలు నాకూ రాంబాబుకీ పరిచయం ఎలా అయిందో తెలుసా?" అంది. అతని పళ్ళెంలో మరి కాస్త కూర వడ్డించి.

"నీకు తెలుసుగదా! నేను పది గంటల దాకా నిద్రలేవను. లేవగానే గబగబా తయారై ఆఫీసుకి వెళ్ళిపోతాను. సాయంత్రం సరాసరి ఇంటికి వస్తాను. మరింక పదిగంటలకి ఆడపిల్లలంతా కాలేజీలకి ఆఫీసులకి వెళ్ళి పోతారు గదా! నేనెవర్ని ఎంచుకోవాలి?" అన్నాడతను.

నాకు నవ్వొచ్చింది.

"పోనీ రైల్లో, బస్‌లో, ఎక్కడైనా" అన్నాను.

"కంపెనీ కారిచ్చింది కదా! చచ్చినట్టు కారులోనే టూర్ చెయ్యాలి బాబూ నీలా ఫస్ట్‌క్లాస్‌లో దర్జాగా కూర్చుని కాదు."

"లాభం లేదు, నువ్వు చాలా ఫాస్టీడియస్, ఏసీ త్వరగా నచ్చదు. నీ ఇంటినీ నిన్నూ చూస్తే ఆ విషయం తెలిసిపోతుంది. నీకు పెళ్లి కావడం కష్టం, ప్చ్" అన్నది భారతి.

"పోనీయ్—హాయిగా ఉన్నాను. ఎప్పుడు బోర్ కొడితే అప్పుడు మీ ఇంటికొస్తూ ఉంటాను" అన్నాడు. చాలాకాలం తరువాత నేను మాట్లాడడం తగ్గించానేమోనన్న భావం కదిలింది, వాళ్లే ఎక్కువ మాట్లాడుతున్నారు. ఆ తరువాత ప్రతివారం అతను నాకు కంపల్సరీ గెస్ట్ అయిపోయాడు. అతను వస్తూ స్వీట్సో, పళ్లో, పుస్తకాలో తెస్తాడు. సాయంత్రం తనింటికి మూవీ చూడ్డానికి రమ్మంటాడు. భారతి టెలివిజన్ సెట్ కొన్నదిగానీ మేమింకా వి.సి.ఆర్. కొనుక్కోలేదు. నేను వివేకానంద అంత ధనవంతుణ్ణి కాను. నేను చేసేది మంచి ఉద్యోగమే. నెలకి రెండు వేలొస్తాయి. అయితే అందులో మా అమ్మకి నేను నెలకి ఐదొందలు పంపాలి. ఆవిడ అక్కర్లేదంటుంది. కానీ నేను పంపుతాను. అమ్మకి డబ్బు పంపి, నా పాకెట్ మనీ తీసుకొని తక్కింది భారతికిస్తాను. ఆవిడ జీతానికి జమ ఖర్చులు నేను అడగను. ఆవిడ చెప్పబోయినా నేను వినను. ఆదివారం ఒక్కటీ కూడా అతిథులతో కిటకిటలాడిపోవడం నాకెందుకో బాధ అనిపిస్తోంది. ఇటీవల అలా అనుకుంటూ ఉండగా ఓ రోజు సాయంత్రం వివేకానంద చాలా హడావుడిగా వచ్చేడు,

"రాంబాబూ నేను ఊరెడుతున్నానోయ్, మా నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చిందని ఫోన్ వచ్చింది. ఓ నెల సెలవు తీసుకున్నాను. విసిఆర్ నువ్వు వాడుకో. స్టీరియో కూడా పట్టుకొచ్చేను. భారతికి జాన్

లెస్సన్ అంటే చాలా ఇష్టం. క్యాసెట్లన్నీ తెచ్చేను" అనేసి తెచ్చిన వస్తువులన్నీ అప్పగించి వెళ్ళిపోయేడు.

అన్నీ భారతికిష్టం — భారతికిష్టం అంటాడు. నేను కొంచెం మొహం చిట్లించుకుంటూ ఉండగా భారతి వంట ఇంట్లోనించి వచ్చి, స్టీరియో అమర్చి బీటిల్స్ క్యాసెట్ తగిలించింది. 'షి లవ్స్ యూ యూ-యూ-"

నాకు మొదటినించీ ఇలాంటి సంగీతం పడదు. అయినా ఊరు కున్నాను. ఆవిడ చాలా ఇష్టంగా వింటోంది గనుక.

వివేకానంద నెలరోజులు ఊరికి వెళ్ళడం నాకు సంతోషంగా అని పించింది.

"ఈ శనివారం మనం ఎక్కడికీ వెళ్ళద్దు. మంచి తెలుగు సినిమా తెసుకుని చూద్దాం ఏం?" అంది భారతి.

'అమ్మయ్య' అనుకున్నాను.

నిజానికి నేను తెలుగు సినిమాలు ఇష్టపడను.

ఇంతకీ ఆవిడ తెచ్చిన క్యాసట్ "మాయాబజారు" భారతి అభి రుచులు చాలా తమాషాగా వుంటాయి, పేం మూవీ వేయటం మొదలు పెట్టగానే, సారథి భార్యతో సహా వచ్చేశాడు. నిజానికి నేనింకా పిలువలేదు మొదటిసారి భార్యతోసహా వచ్చేడు కనక సంతోషంగానే ఆహ్వానించేను.

"విపేర్ రాలేదా ఏం?" అన్నాడు వస్తూనే.

"లేదు" అన్నాను.

"వి. సి. ఆర్. అతన్దేనటగా? ఈ మధ్యన ఎక్కువ కనపడ్డం లేదు-మీ ఇంట్లోనే ఉంటున్నాట్టగా?" అన్నాడు గబగబా.

"ఏం? ఉంటే? అంది భారతి వళ్ళుమంటగా.

"ఆ! ఏంలేను - మా ఆవిణ్ణి పరిచయం చెయ్యలేదుగా! లలిత

తెలుగు ఎం. ఏం. ఈవిడ భారతిగారు. బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్-ఇతను ఆవిడ భర్త రాంబాబు – నాలానే సేల్స్ ఎక్సిక్యూటివ్. చాలా ఐడియల్ ఫామిలీ–రాంబాబు తండ్రిదీ వర్ణాంతర వివాహమే-ఇతన్దీ అదే, వాళ్ళ ఫాదర్‌ది మనకులమే-అమ్మగారిది మాత్రం అదేదో చాలా వెనుక బడిన కులం - షెడ్యూల్డ్ కాస్ట్ – సరే భారతిగారిది" అతను సాగి పోతుంటే–

"యూ గెటౌట్" అని అరవాలనిపించింది అతని గొంతులోని వ్యంగానికి.

లలితగారు మాకు నమస్కారాలు చేసింది. చేతులకి డజనేసి చొప్పున బంగారపు గాజులు, మెడలో బంగారం నెక్లేసు–పట్టుచీర,

ఆ ఫలానా కులంలో పుట్టినందుకు సారథికి కొంచెం గర్వం ఉందన్న సంగతి అందరికీ తెలుసు.

భారతి వీడియో స్విచ్ ఆఫ్ చేసి వంట ఇంట్లోకి వెళ్ళింది-మీనన్ భార్య భారతితోపాటు తనూ లోపలికి వెళ్ళి సాయం చేస్తుంది.అమాటకొస్తే వివేక్ కూడా భారతికి సాయం చేస్తాడు. కానీ లలిత లేవలేదు. ఆవిడలాగే కూర్చుంది. భారతి కాఫీ తెచ్చింది.

"ఈ టైంలో కాఫీ వద్దండీ" అని లలిత తీసుకోలేదు. ఆ కాఫీని మా ముగ్గురి కప్పుల్లో సర్ది ఆవిడకి కూల్‌డ్రింక్ తెచ్చిచ్చింది.

"ఈ సామానంతా నీకు వివేక్ ప్రెజెంట్ చేశాట్టగా!" అన్నాడు సారథి.

"అని వివేక్ నీకు చెప్పాడా!" అన్నాను.

"లేదు, అప్పిచ్చానన్నాడు. చాలా తీర్చావని కూడా అన్నాడు. కానీ అది నిజం కాదని మీనన్ అన్నాడు, భారతిగారూ వివేక్ చిన్నప్పటి స్నేహితులనీ అందుకని పెళ్ళికి సామానంతా కొనిచ్చాడనీ మీనన్ అందరితో చెబుతున్నాడు.

"నువ్వు మీనన్‌ని నమ్మావా? వివేక్‌ని నమ్మావా?" అన్నాను– కొంచెం తీవ్రంగానే.

సారథి రెండు నిముషాలు నా మొహంలోకి చూసి, "వివేకానందనే నమ్ముతాను బ్రదర్–హి ఈజ్ ఎ పర్‌ఫెక్ట్ జంటిల్మన్" అన్నాడు.

అతని మాట అనకపోతే నేను వాళ్ళిద్దర్నీ ఆ పూట డిన్నర్‌కి ఉండమనే వాణ్ణి కానేమో!

ఆ తరువాత సారథి వివేక్‌ని గురించిన ప్రసక్తి తేలేదు. నాకు మీనన్ మీద కోపం వచ్చింది. నాకూ వివేకానందకీ మూడేళ్ళ స్నేహం అయితే-మీనన్‌కీ వివేకానందకీ పదేళ్ళ స్నేహం. వివేకానంద తండ్రి ఉద్యోగరీత్యా కాలికట్‌లో ఉండగా మీనన్ తండ్రితో పరిచయం-రెండు కుటుంబాల స్నేహం-అటువంటిది ఇన్ని సంవత్సరాలుగా వివేకానందని గూర్చి తెలుసుకొని అతనిలా ప్రచారం చెయ్యడం ఏమిటో నాకు అర్థం కాలేదు. "పెట్టీ జెలసీస్" అని కొట్టి పారేసింది భారతి. సారథి భార్య లలిత కొంచెం గర్విష్ఠి, ఆ ఇద్దరూ భోజనంచేసి వెళ్ళాక మేం చాలా రిలీఫ్ పొందాం. రెండు రోజుల తరువాత ఓ రోజు సాయంత్రం భారతి అంది.

"ఇంట్లో సరుకులన్నీ అయిపోయాయి. వివేక్ ఉంటే కారడిగే దాన్ని-ఒక్కసారే అన్నీ తెచ్చేసుకునే వాళ్ళం." అని

"మనకున్న దాంతో మనం తృప్తిపడాలి. అతని కారు మన కెందుకు? రిక్షాలో తెచ్చుకో కూడదా?" అన్నాను.

"అవుననుకో! వివేక్ మనవాడే కదా! అతనేం అనుకోడు-నన్ను చాలాసార్లు అతను షాపింగ్‌కి తీసుకెళ్ళాడు" అంది భారతి.

"అతను నిన్ను షాపింగ్‌కి తీసుకెళ్ళడం ఎందుకు? నువ్వు వెళ్ళ లేవా?" అన్నాను.

"కారుంది గనుక? తప్పేం?" అంది.

నేనేం మాట్లాడలేదు.

"స్కూటర్ కొనుక్కోకూడదూ?" అంది.

"నాదగ్గర డబ్బు లేదు" అన్నాను.

"నా దగ్గరుంది, స్కూటరుంటే మనిద్దరికీ ఉపయోగమే. నేను బెంగుళూర్లో ఉండగా నేర్చుకున్నాను. మనిద్దరం ఒకటైన తరువాత నీ డబ్బేమిటి? నువ్వెందుకిలా ఆలోచిస్తావో నాకర్థం కాదు. మా అన్నయ్య పాపం ఓ మంచి పనిచేసేడు. నాకు ఉద్యోగం వచ్చిన నాలుగేళ్ళ నించీ నా జీతం అంతా నన్నే దాచుకోమన్నాడు" అంది.

వారం రోజుల్లో స్కూటర్ కొన్నాను నేను. స్కూటర్ కొనడం మంచిదే. లేకపోతే వివేకానంద కారు అడుగుతుంది భారతి.

అనుకోకుండా ఓ శనివారం మీనన్ నన్నూ భారతినీ భోజనానికి పిలిచేడు. నాకు అతనింటికి వెళ్ళడం ఇష్టం లేదు. ఐనా భారతి బలవంతం మీద బయలుదేరేను. అంతక్రితం ఓ రోజు తన ఇంటికి రమ్మని మీనన్ ఫోన్ చేస్తే ఎవరిదో డాన్స్ ప్రోగ్రాం ఉంది తను రానంది భారతి. నేను డాన్స్ చూడ్డం ఇష్టంలేక ఇంటి దగ్గరే ఉండిపోయేను.

"నువ్వింత వరకూ వివేక్‌ని భోజనానికి ఎందుకు పిలవలేదు?" అని అడిగాను.

భారతి మీనన్ భార్యకి సాయం చెయ్యడానికి లోపలికి వెళ్ళినప్పుడు అతనన్నాడు.

మా ఆవిడకి వివేక్ అంటే ఇష్టం లేదు" నేను ఉలిక్కిపడ్డాను "ఏం" అని.

"నీకు తెలీదు బ్రదర్ నువ్వు అమాయకుడివి. అతను ఆడవాళ్ళని కళ్ళతోనే తాగేస్తాడు."

"ఛస్" అన్నాను నేను మీనన్ పట్ల చాలా అసహ్యంతో.

మీనన్ గొంతు తగ్గించాడు. "బిట్వీన్ యూ అండ్ మి" అన్నాడు.

"ఆవిడ్ని మొదటిసారి వాళ్ళింటికి తీసుకెళ్ళినప్పుడు భోజనం చేస్తూండగా టేబుల్ క్రిందనించి కాలుతొక్కి నవ్వాడట తెలుసా?" అన్నాడు.

"మీ ఆవిడ నీకు చెప్పిందా?"

"అవును-లేకపోతే నాకేం తెలుసు? నువ్వు మరీ పిల్లవాడిలా ఉన్నావు. అతనికింకా పెళ్ళికాలేదు. మోహం వాచి ఉన్నాడు. జానకి ఒక్కత్తే చాలదు అతనికి-అయినా నువ్వు ఎందుకు రానిస్తున్నావో నాకర్థం కావడం లేదు."

ఇంక నేను వినలేదు ఆ సంభాషణని. నాకు మీనన్ ఇంట్లో భోజనం సహించలేదు.

"నువ్వేం తినలేదు భాయ్" అన్నాడు.

నీ బొంద!" అనుకున్నాను.

మరునాడు మా అమ్మ దగ్గర్నుంచీ ఉత్తరం వచ్చింది. "నాకు డబ్బే ప్రధానం అనుకుని నెలకింత పంపుతున్నావు - క్రొత్త కోడల్ని చూపించాలనే ధ్యాసం అయినా నీకు లేనందుకు సిగ్గుపడుతున్నాను. ఆమె కోసం పట్టుచీర కొన్నాను."

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"భలేవాడివి రాంబాబు! ఇలాంటి తల్లిని ఎలా చూసుకోవాలో తెలీదు నీకు" అని చివాట్లు పెట్టింది భారతి. ఆరుగంటల ప్రయాణం.

నేనింతకాలం భారతిని తీసుకుని అక్కడికి వెళ్ళకపోవడం అటుంచి, కనీసం వాళ్ళిద్దర్నీ నా ఇంటికి రమ్మని కూడా ఎందుకు పిలవలేదో నాకర్థం కాలేదు. భారతిని చూసి అమ్మ సంతోషించింది.

"తమది గొప్ప కులం-ఎరుటివాళ్ళది తక్కువ కులం అని భావించే మనుష్యులు—త్వరపడి గొప్ప చెప్పుకోడం కోసం-ఏదో త్యాగం చేస్తున్నాం అనుకొని పెళ్ళి చేసుకొని తరువాత వాళ్ళు బాధపడి—ఎదుటి వాళ్ళని బాధ పెడతారు రాంబాబూ - ఆ విషయం నీకు నేను చెప్పక్కర్లేదు - భారతి అలాంటి అమ్మాయి కాకుండా ఉండాలని నేను నిన్ను దీవిస్తున్నాను" అంది మా అమ్మ.

ఆవిడ ఇంకా అన్నది. "కులం మనిషికి హ్యాండీక్యాప్ కాదు-వరమూ కాదు. నీ ఎస్సెల్సీ రిజిస్టర్‌లో నా కులం నమోదు చేసుకుంటే నీకీపాటికి లెక్కలేనన్ని ఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చేవి. కానీ మీనాన్న నిన్నెప్పటికైనా మమ్మల్ని వెలివేసిన చుట్టాల్లో కలపాలని తన కులం వ్రాశారు. ఏ కులమైనా, ఏ కులం కాకపోయినా నీకు తెలిసితేటలున్నాయి. వాటితోనే ఓ జీవితం వెతుక్కోగలవనే నమ్మకం నాకుంది గనుక నేనేం పట్టించుకోలేదు. కనుక "కులం" అని ఒకటుందని మర్చిపోతేనే మీరు సుఖపడతారు. నేను మీకు చెప్పేది అదొక్కటే" అంది మా అమ్మ. "కులం" ఆవిడ జీవితం మీద పెద్ద దెబ్బ తీసింది.

ఏ మనిషితో జీవితం పంచుకుంటే స్వర్గం చవి చూస్తానని ఆశ పడిందో, ఆ మనిషి ఆమెకి నరకం చూపించేడు. క్షణం క్షణం హింసించేడు. నాకున్న ఒకే ఒక చెల్లి బ్రతుకు బాగు చెయ్యడం కోసం, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండి మా అమ్మ ఆ వ్యక్తి నీడనే ఉండిపోయింది. తమ కుటుంబం ఆదర్శ కుటుంబం అని పదిమందీ అనుకోవాలని మాకు ఖ్యాతి తేవాలని—నా చెల్లికి వ్యవస్థ అర్థం అయింది. దానికి వివాహం

అంటే విముఖత్వం ఏర్పడింది. అదీ నాలాగే ఓ ఉద్యోగం సంపాదించు కొని వెళ్ళిపోయింది. మా అమ్మ అందం మా నాన్న రంగు — దానికి వరాలయ్యాయి. అది ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో హోస్టెస్‌గా వెళ్ళి పోయింది. అమ్మ నర్సుగా ఉద్యోగం చేసి. రిటైర్ అయింది. ప్రస్తుతం తనకన్నా చాలా ఎక్కువ కులంలో పుట్టి, ఎంతో త్యాగం చేసిన భర్తకి నర్సింగ్ చేస్తోంది. ఆయన వున్నంత వరకూ ఆవిడెక్కడికీ రాదు. ఆవిడ భారత దేశంలో పుట్టింది అని కాదు. ఆవిడ ఆయన్ని ప్రేమించింది అనేమో మరి.

ఈ దేశంలో ఎన్ని కులాలు-మళ్ళీ అందులో ఎన్ని శాఖలు? ఇంకెక్కడా లేవన్ని. తన మేధాశక్తినీ తన భుజబలాన్నీ ఉపయోగించు కుని జీవితం సాగించుకోలేని మనిషి కులాన్ని అండగా పెట్టుకుని స్వప్ర యోజనాలు సాధించుకుంటున్నాడు. కాస్మోపాలిటన్ అవుట్ లుక్ అని చెప్పుకుంటూ ఇంకా "నువ్వు ఈ కులం" అని వెక్కిరించే సారధిలాంటి మనుష్యులున్నంత వరకూ ఇంతేనేమో మరి.

మేం ఇంటికి వచ్చేసరికి వివేకానంద దగ్గర్నుంచి ఉత్తరంవచ్చింది. అతని తండ్రి చనిపోయాడని ఫలానా తేదీని కర్మలనీ.

"నాకు ఆంటీని చూడాలనుంది వెడదాం" అంది భారతి.

ఎప్పుడూ చాలా సంతోషంగా ఉండే వివేకానంద్ కూడా తండ్రి మరణంతో కొంత దెబ్బతిన్నాడనిపించింది. ఆవిడ భారతిని చూసి సం తోషించింది. ఆవిడకి వివేకానంద ఒక్కడె కొడుకు. తల్లిని తీసుకొని వచ్చేడతను.

వివేకానంద తల్లి వచ్చాక తరచు భారతి వాళ్ళింటికి వెడుతోంది.

"ఎప్పుడూ ఎందుకు" అంటే "పాపం ఆంటీ ఒక్కతే ఉంది కదా!" అంటోంది.

ఆరోజు భారతి బ్యాంకు నుంచి వచ్చింది. ఏడు గంటల దాకా కబుర్లు చెప్పుకున్నాక, "ఇప్పుడే ఆంటీని చూపొస్తా" అని వివేకానంద ఇంటికి వెళ్ళింది.

అంతలో మీసన్ వచ్చేడు. పెళ్ళయినాక సారధి రావడంలేదు. వచ్చినా అతనిప్పుడు కాఫీ తప్ప త్రాగడం లేదు,

"మిసెస్ రాంబాబు లేరా?" అన్నాడు.

"లేదు. వివేక్ ఇంటికి వెళ్ళింది" అన్నాను.

"అవునవును. ఈ మధ్యన ఎక్కువగా ఆవిడ అక్కడే కనిపిస్తోందట" అన్నాడు.

చాలా కాలానికి వచ్చాడని ప్రక్కింటి కుర్రాడిని సైకిలిచ్చి బీర్ తెప్పించేను. సంతోషించేడు. భార్య ఫైనాన్సులన్నీ కంట్రోల్ చేసేసిందట. త్రాగడం తగ్గించేడట. కొంచెం వొళ్ళు కూడా తగ్గిందట. ఇదీ బాగానే వుందన్నాడు. అతనికిప్పుడు త్రాగాలనిపించి ఉంటుంది. అందుకే వచ్చాడు అనిపించింది.

"మీ ఆంధ్రాస్‌కి కులాభిమానం ఎక్కువ" అన్నాడు ఉన్నట్లుండి.

"ఏం అన్నాను".

"ఎలా అయినా! భారతికి వివేకానంద అంటే అదే ఇష్టం. సారధి చూశావా పెళ్ళయినాక మన స్నేహాలు విడిచిపెట్టేసి అవధానితో తిరుగుతున్నాడు. అవధానికి అదేదో కాలేజి సెక్రటరీ మేనమామట, వాళ్ళావిడకి లెక్చరర్ ఉద్యోగం కోసం."

నేనేం మాట్లాడలేదు. "నీకు కులం లేదు గనుక నీకలాంటి విషయాలు తెలీవు" అన్నాను రెండో బాటిల్ ఓపెన్ చేసి.

"రేపటినించీ నువ్వు మా ఇంటికి రాకు" అన్నాను.

"ఏ?ం" అన్నాడు.

"కులం లేదు కనుక"

"నిన్ను అఫెండ్ చేయాలని కాదు భాయ్ — కాంప్లిమెరట్‌గా అన్నాను-" అన్నాడు—

అతను వెళ్ళాక నాకెందుకో వాంతి అయింది. భారతి వివేకానంద కారులో వచ్చింది. ఆమెతోపాటు వివేకానంద, అతని తల్లి ఓ క్యారియరు కూడావచ్చేయి—అందరికీ భోజనం వడ్డించింది భారతి-

"పిల్లని పెళ్ళి చేసుకోమని నువ్వు చెప్పనాయినా?" అంది ఆవిడ.

"ఎవరైన్నానో ప్రేమించి విఫలం అయ్యిందేమో కనుక్కోండి—" అన్నాను-నేనలా ఎందుకన్నానో నాకే తెలీలేదు-

"నీ మొహాం నోర్ముయ్-" అన్నాడు వివేక్ -

"లక్షణమైన అమ్మాయిని వెతకండి-ఐదు లక్షల కట్నంతో-" అన్నాను మళ్ళీ-

భారతి నా మొహంలోకి తీక్షణంగా చూసింది-నాకు ఒళ్ళు మండింది-

"జానకికి కూడా పెళ్ళి కుదిరిందట. పదిహేనో తారీకునట-ఇంక వీడికి వండి పెట్టేదెవరో? నేను వెళ్ళిపోతాను- ఇక్కడుండను-" అన్నదావిడ మళ్ళీ.

"జానకిపెళ్ళికి వివేక్‌రెండు వేలిచ్చేడుతెలుసా" అందిభారతి, అతని వంక ఆరాధనగా చూసి.

"ఉంది గనుక ఇచ్చేడు-మనబోటి వాళ్ళం ఏం ఇవ్వగలం?" అన్నాను.

"ఉన్నవాళ్ళకి మాత్రం మనస్సు ఒస్పద్దా ఏం? మా ఇంట్లో వదే

ళ్ళుగా పని చేస్తోంది పార్వతి-దాని కూతురి పెళ్ళికి వంద ఇవ్వడానికి బాధపడింది మా వదినె-" అంది భారతి.

"వివేక్ చాలా గొప్పవాడు"అన్నాను నేను.

"ఇవ్వాళ నీలో దెయ్యం ప్రవేశించింది" అంది భారతి వాళ్ళు వెళ్ళాక.

ఆమె వెంటనే నిద్రపోయింది గానీ నేను పోలేదు. నా కన్నా ముందు వివేకానందతో భారతికి ఈ ఊళ్ళో పరిచయం అయివుంటే వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకుని ఉండేవాళ్ళేమో. ఓకే కులం అనే ఊహ మొదటి సారి నాలో మెదిలింది. రెండు రోజుల తరువాత నేను కాన్ఫరెన్స్‌కి మద్రాసు వెళ్ళవలసి వచ్చింది.

"నువ్వొచ్చేదాకా వివేక్ ఇంట్లో ఉంటాను" అంది భారతి.

"ఆ సంగతి నాకు తెలుసు" అన్నాను నేను.

ఆమె నా వైపు చూసింది. ఏమీ అనలేదు. నువ్వు వివేక్ ఇంటికి వెళ్ళొద్దు ఇక్కడే ఉండు" అని చెప్పాలని ప్రయత్నించాను. సంస్కారం అడ్డొచ్చింది చెప్పలేదు.

నేను మద్రాసు నుంచి సరాసరి వివేక్ ఇంటికి వెళ్ళేను, వెళ్ళేసరికి భారతీ వివేకానంద డైనింగ్ టేబుల్‌మీద టెన్నిస్ ఆడుతున్నారు. అతని తల్లి భగవద్గీత కాబోలు చదువుతోంది. నన్ను చూసి అతనే జానకిని పిలిచి స్వయంగా కాఫీ తెప్పించాడు. నా కోసం వంకాయ కూర వండమని ఆజ్ఞాపించాడు. అంత క్రితం వాళ్లు నాన్‌వేజ్ వండుకుని ఉంటారు. మా నాన్న మా ఇంట్లో నాన్‌వేజ్ వండనిచ్చేవారు కాదు. పెళ్ళవడంతోనే అమ్మ మానేసింది. నాకూ అలవాటుకాలేదు. భారతికి నాన్‌వేజ్ సహించి నట్లు కూరలు సహించవు, ఆమె నేనూ కలిసి రెండు రకాలూ వండు కుంటాం కష్టపడి, మమ్మల్ని కారులో దింపేడు వివేకానంద.

కిటికీ కర్టెన్లు పైకెత్తి దుప్పట్లు దులుపుతూ "నిన్న మా అన్నయ్య బ్యాంక్‌కి వచ్చేడు. నన్ను పలకరించాడు. మనిద్దర్ని ఇంటికి పిలవడానికి ఆదివారం వదిన్ని తీసుకుని వస్తాడట" అంది.

"నువ్వెంత తొందరపడ్డావు భారతీ. నాలుగయిదు లక్షలు ఆదాఅయినం దుకుబహుశా మీఅన్నయ్యసంతోష పడుతూండొచ్చు. కానీనువ్వే"అన్నాను

"నీలో దెయ్యం ప్రవేశించిందని మొన్ననేచెప్పాను. అదెయ్యాన్ని ఎవరు ప్రవేశ పెడుతున్నారో కూడా నాకు తెలుసు. నీదేదో గట్టి మనసు ఏం కాంప్లెక్సులు లేని ఆత్మాభిమానం గల మనిషిని అనుకుంటూ వచ్చాను ఈసారి మీ మిసెస్‌గారి కోసం మనింటికి వచ్చాడంటే చూడు-అడగ వలసిందంతా అడిగేస్తాను" అంది దీపం ఆర్పి అటు తిరిగి పడుకొని.

నాకు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అనీ ఆత్మాభిమానం లేదని ఆవిడ ఉద్దేశ్యమా? అనుకుంటూ అశాంతిగా నిద్రపోయేను.

తెల్లవారింది! భారతీ నేనూ మాట్లాడుకోలేదు. మాకు పెళ్ళయి దాదాపు పదినెలలయింది. ఇలా మాట్లాడుకోకుండా ఉండటం ఇదే మొదలు భారతి కూడా మా నాన్నలా సుపీరియారిటీ ఫీలవుతుందా! అసలు వివేక్ ఇంటికి "ఆంటీ" వంకతో రోజూ ఈవిడ వెళ్ళడం దేనికి? ఇలాంటి ప్రశ్నలన్నీ మనస్సు నిండి గజిబిజిగా ఉన్నాయి. భారతికి ఎవరన్నా భయం లేదు. ఏం అడగాలన్నా మొహాన్నే అడిగేస్తుంది. నేనడిగే ప్రశ్నలకి ఆటంబాంబు ల్లాంటి సమాధానాలు చెప్పేసి, "నీకు నాకూ పడదు రాంబాబూ-గుడ్‌బై" అని కూడా అనగలదు. ఈ ధైర్యాన్నే ఈ సూటి స్వభావాన్నే నేను ఇష్టపడి ఆమెని నా జీవితంలోకి ఆహ్వానించాను. నేను దిగులు పడిపోయాను.

రెండు రోజులు గడిచేయి. భారతి మళ్ళీ వివేకానంద ఇంటికి

వెళ్ళింది. నన్ను రమ్మని కూడా అనలేదు. మీనన్ మాటలు గుర్తొచ్చాయి. అతను ఆడవాళ్ళని ఆకర్షిస్తాడు. ఆడవాళ్ళు అతన్ని అభిమానిస్తారు. అందుకే మీనన్ అతన్ని దూరంగా ఉంచేడు, సారధిని కూడా దూరంగా ఉంచేడు. నేను నా పిరికి తనానికి సంస్కారం అనే ముసుగు తగిలించుకొని పిచ్చివాడిని అయిపోయాను.

భారతివచ్చి భోజనానికి రమ్మంది. నాకక్కర్లేదని పడుకున్నాను. అవిడొక్కర్తీ తినేసింది. నన్ను బ్రతిమలాడలేదు. తినేసి నిద్రపోయింది. మూడు రోజులు అలాగే గడిచాయి. ఆరోజు సాయంత్రం భారతి బ్యాంకు నించి వస్తూనే మీనన్ భార్యని వెంటబెట్టుకుని వచ్చింది. సాధారణంగా ఆమె ఒక్కతీ ఎక్కడికీ రాదు. వెంట అతను లేకుండా. మీనన్ భార్యది ఎవరైనా అలా నిలబెట్టే అందం. మోకాళ్ళవరకూ జడ, పెద్ద కళ్ళు, చక్కని ముక్కు, ఇవాళ ఇలా ఆవిడ ఒక్కతే రావడం నాకాశ్చర్యం అనిపించింది.

"మిసెస్ మీనన్ వచ్చింది. బయట కూర్చుందాం" అని పిలిచింది భారతి. ఆవిడ పేరు రాధ—రాధ లోపలికి వెళ్ళి భారతితోపాటు "టీ" చేసి తెచ్చింది. ముగ్గురం కూర్చున్నాం. "వివేక్ ఇంటికి వెళ్ళినప్పుడు అతను నీ కాలు తొక్కాడట కదూ! నువ్వెలా ఊరుకున్నావ్?" అంది భారతి ఉన్నట్లుండి.

"అతను నాకాలు త్రొక్కడం ఏమిటి! నీకు మతి పోయిఉండాలి. వివేక్ అల్లాంటి పన్లు చేస్తాడంటే నువ్వు నమ్ముతావా" అంది మీనన్ భార్య "మరి ఆవిషయం నువ్వు మీ ఆయన్తో చెప్పావట కదా! నీకువివేక్ అంటే యిష్టం లేదటకదా" అంది భారతి మళ్ళీ.

"షిట్—"అంది రాధ ఆమె మొహం ఎర్రబడింది.

ఐదు నిమిషాలు ఎవరం మాట్లాడలేదు. భారతి మీనన్ చెప్పిన మాటలు ఎలా విందో నాకర్థం కాలేదు. ఏదో చెప్పాలనుకుని చెప్పలేక పోతున్న ఆవేదన మీనన్ భార్య ముఖంలో స్పష్టం అయింది. "మీరు మాట్లాడుతూండండి. నేనలా వెళ్ళొస్తా"అని చెప్పులేసుకుని వెళ్ళిపోయాను.

భారతి మీనన్ భార్యని దిగబెట్టి వచ్చేవరకూ నేనింటికి రాలేదు.

భారతీ నేనూ మౌనంగా వున్నాం.ఏదైనా మొహాన అనేస్తావనినిన్ను అభిమానించాను. కానీ నువ్వు మారిపోతున్నావు" అంది భారతి టేబుల్ దగ్గర్నుంచి లేచేటప్పుడు.

నేనేం అనలేదు. ఆమెకూడా ఏమీ అనలేదు.

నాలుగు రోజుల తరువాత అఫీసు నుంచీ వస్తువుంటే వివేకానంద కనిపించి, ఇంటికి తీసుకు వెళ్ళేడు.

తనే స్వయంగా కాఫీ కలిపి తెచ్చి" మీనన్‌గాడేంచేసేడో తెలుసా" అన్నాడు. ఇల్లాంటి మాటలు వివేకానంద నోటి వెంట వినడం ఇదే మొదలు.

"తనకన్నా తెలివి గలదాన్నీ, అందమైనదాన్నీ ఏరికోరి చేసుకున్నాడు. ఇప్పుడా తెలివీ అందం భరించలేక తంటాలు పడుతున్నాడు. ఇలాంటి వీరికి సన్నాసులు తమకు తగ్గవాళ్ళనే చేసుకోవాలి. అనవసరంగా అవతలి వాళ్ళని బాధపెట్టడం ఎందుకు? వీడికి చచ్చే అనుమానం అట. వాళ్ళ పక్కింటి మెడికల్ రిప్రెజెంటేటివ్ చెప్పేడు. నిన్ను అందుకేగా ఇంటికి పిలవడు? నేను చూడ్డానికి బావుంటాను. నామంచి మ్యానర్స్-చూసి అవిదెక్కడ నావలలో పడుతుందో అని వీడిబాధ! ఈడియట్"

వివేకానంద ఆవేశం నేనెప్పుడూ చూడలేదు.

"భారతి నా ఫ్రెండని ఇంతెడు సామాన్లు ప్రెజెంట్ చేశానని

సారధికి చెప్పేట్ట· వాడి నింక గుమ్మం తొక్కనిస్తేచూడు. నాకు కోపం సాధారణంగా రాదు బ్రదర్. వచ్చిందంటే ఇంక జన్మలో వాడి మొహం చూడనంతే. నాలుగేళ్ల నా ఇంటిమీదపడి తెగ తిన్నాడు. పైగా జానకి పైన కన్నేశారిద్దరూ. ఆమెనిరక్షించలేకచచ్చేను." ఇంత చదువుకుని సంస్కారం నేర్చిన ప్రపంచం వెనుక ఉండే అసలు స్వరూపం.

భారతిని తీసుకొస్తాను. ఈ పూటకి ఇక్కడుండు." అన్నాడు వివేకానంద.

"కాదులే-నాక్కొంచెం పనుంది. రేపు అమ్మని తీసుకొని నువ్వే వచ్చేయ్" అని చెప్పి ఇంటికి వచ్చాను.

నా మనసులో ప్రవేశించిన "దయ్యం" బయటికి వచ్చినట్లయింది.

"ఏం ఇవ్వాలింతలేటు?" అంది బారతి

"వివేక్ ఇంటికి వెళ్లాను" అన్నాను.

"నేనూ వద్దామనుకున్నా అయినా రాలేదు"

"మా అన్నయ్యొచ్చాడు. నీకోసం కూర్చుని కూర్చుని వెళ్ళాడు. అంది కాస్సేపాగి—

"ఏం చెప్పావు?" అన్నాను.

"అదివారం నిన్ను తీసుకొని భోజనానికి వస్తానన్నాను. మళ్ళీ తను రానవసరం లేదన్నాను. సంతోషించాడు.

"నా మీద అంత నమ్మకంతో చెప్పావా?"

"అవును—తప్పులు చెయ్యడం- దిద్దికోవడం మనిషికి సహజం—దయ్యం వచ్చింది—వెళ్ళిపోయింది, ఈ సరికి అనుకున్నాను- అందుకని చెప్పాను" అంది.

"అవును-దెయ్యం వెళ్లిపోయింది. ఇంక రాదు" అన్నాను.

"నౌ యు ఆర్ ఎ గుడ్ గై" అని గలగలా నవ్వి౦ది.